www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 22 అక్టోబర్ 2024
5
అన్నమయ్య



ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు 31 వరకు గడువు పెంపు

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలకు ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డి, ఓపెన్ స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండారు శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశాలకు గడువు పెంచాలంటూ అన్ని వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ డైరెక్టర్ నాగేశ్వరరావు స్పందించి ముగిసిన గడువును ఈనెల 31వరకు పొడిగించారని తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 25కు వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 26 నుంచి 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 30, 31వ తేదీలలో రూ.500లు అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేశారు. ఓపెన్ స్కూల్స్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందాలనుకునే వారు సమీపంలో ఓపెన్ స్కూల్స్ అధ్యయన కేంద్రం ద్వారా కానీ, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ద్వారా కానీ సంప్రదించి ప్రవేశం పొందవచ్చునని పేర్కొన్నారు.

వాలంటీర్ వ్యవస్థ ఉన్నట్లా..లేనట్లా?

- రూ.10 వేలు హామీ గాలికేనా
- జిల్లాలో 8,628 మంది వాలంటీర్లు ఎదురుచూపులు?

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణ, గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న తమను కొన సాగిస్తారా లేదా అని వాలంటీర్లు ఎదురుచూస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో మహాకూటమి ఏర్పడి నాలుగు నెలలు గడిచినప్పటికీ వాలంటీర్ వ్యవస్థపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో జిల్లాలో వాలంటీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 8,628 మంది ఉన్నారు. గత ప్రభుత్వంలో వాలంటీర్లకు ఒకరికి రూ.5 వేల చొప్పున వేతనాన్ని అంద జేసేవారు. రూ.5 వేలు చొప్పున వాలంటీర్లందరికీ కలిపి నెలకు రూ.4.31 కోట్లు చెల్లించేవారు. సార్వత్రిక ఎన్నికలలో ముందు జిల్లా వ్యాప్తంగా 3,109 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. గ్రామాలలో రూ.5 వేలతో కుటుంబాలను కలిసి జీవనం సాగించేవారు. ఎన్నికల కోడ్ రావడంతో వస్తున్నటువంటి వేతనా న్ని ఆపేశారు. అప్పటి నుంచి వాలంటీర్లు అందరూ ఆందోళన చెందుతున్నారు.

ఎదురుచూపులు?

వాలంటీర్ వ్యవస్థను ముందు నుంచి టిడిపి, జనసేన నాయకులు విమర్శిస్తూనే ఉన్నారు. మరో వైపు ఎన్నికల సమయంలో వాలంటీర్ల కొనసాగిస్తామని వేతనాలు కూడా రెట్టింపు చేస్తామని పార్టీల నేతలు హామీ ఇచ్చారు. దానితో అధికారం వచ్చిన తర్వాత తమకు ఎలాంటి ఢోకా ఉండదని వాలంటీర్లు కూడా ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామ వార్డు స్థాయిలో ప్రతి రెండు వేల జనాభాకు ఒకటి సచివా లయం ఏర్పాటు చేశారు. ఆయా సచివాలయాల్లో వివిధ విభాగాలలో పని చేసేం దుకు ప్రభుత్వం సిబ్బందిని కూడా నియమించింది. ప్రభుత్వ ఉద్యోగుల తోడుగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేసేందుకు 2019 ఆగస్టు 15న వారిని విధుల్లోకి తీసుకున్నారు. వీధుల్లో ప్రధానంగా లబ్ధిదారులు ఇంటికి వెళ్లి ప్రతినెలా సామాజిక పింఛను అందించడం, బియ్యం పంపిణీ సహా వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో వారు కీలకంగా వ్యవహరించారు. అప్పట్లో ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు వాలంటీర్ వ్యవస్థను ఇలాగే కొనసాగిస్తామని వారికి వేతనాన్ని కూడా పెంచి రూ. 10 వేలు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వాలంటీర్లు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటు వందరోజులైనా ఎలాంటి స్పష్టత రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని వారు నెరవేర్చి వేతనాలు రూ.10 రూపాయలు ఇవ్వాలని జిల్లాలోని పలువురు వాలంటీర్లు కోరుతున్నారు.

కొనసాగించాలి..

వాలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం లాగానే కొనసాగించాలి. గత ప్రభుత్వ పాలనలో ప్రజల వద్దకే పాలనలో భాగంగా ప్రభు త్వం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి తీసుకురావడంతో రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యను కొంతమేర పరిష్కరించేందుకు కృషి చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా వాలంటీర్లకు రూ. పదివేల వేతనాన్ని అంది స్తూ వారికి ఉద్యోగ భద్రత తను కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలి.



- ఎస్.మహబూబ్ బాషా, వాలంటీర్, రాయచోటి.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- కలెక్టరేట్ ఎదుట వాలంటీర్ల నిరసన

నందలూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వాలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు వాలంటీర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌ను కలిసి వాలంటీర్లు తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వాలంటీర్లకు ఇచ్చిన



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వాలంటీర్లు

హామీలు 4 నెలలు కావస్తున్న ఇంకా నెరవేర్చలేదని, ఉద్యోగ భద్రత కల్పించకుండా కాలయాపన చేస్తుందని వాపోయారు. తక్షణం ఉద్యోగ భద్రత కల్పించి విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించి ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం వాలంటీర్ల జీతం రూ.10 వేలు చేయాలని కోరారు. నందలూరు మండలం నుండి పెద్ద ఎత్తున వాలంటీర్లు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు వాలంటీర్ల అసోసియేషన్ సభ్యులు సాయికృష్ణ, సుబ్రహ్మణ్యంరెడ్డి, సూరి, సుధీర్, కమల్, సతీష్, సుధా, జబీవుల్లా, కమల్‌బాషా, ప్రకాష్, మహిళా వాలంటీర్లు ఉమామహేశ్వరి, స్వప్న, సుధారాణి, పావని, కవిత ,అమ్ములు, ఎల్లమ్మ, వినిత, సుజిత, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

'ముదివేడు' నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

- సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ముదివేడు బాధితులు, నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ముదివేడు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి, పునరా వాసం కల్పించాలి, ఇంటి స్థలాలు ఇవ్వాలి, ఇంటి నిర్మాణం కోసం రూ.25 లక్షలు ఇవ్వాలని, బకాయి ఉన్న లీజు చెల్లించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లి గ్రామంలోని పిచ్చలవారిపల్లి, సీతివారిపల్లి, కొత్తపల్లి, బి.కొత్తకోట మండలం కోటావూరు గ్రామం చౌటకుంటపల్లి, దిన్నెమీదపల్లి గ్రామాల్లో నివాసం ఉన్న 300 మంది రైతులు 780 ఎకరాల భూమిని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం కోల్పోతున్నారని వివరించారు. రిజర్వాయర్ నిర్మించే ప్రాంతంలోని భూమిలో బోరు వేసుకుని వ్యవసాయం చేసుకుంటూ సంవత్సరానికి రెండు, మూడు పంటలు పండించుకుని వచ్చే ఫలసాయంతో రైతులు తమ కుటుంబాన్ని పోషించుకుంటూ ఉండేవారన్నారు. గత ప్రభుత్వం రైతుల ఆమోదం లేకుండా ఏకపక్షంగా వారి భూములు బలవంతంగా తీసుకుని 2021లో ముదివేడు బాలన్సింగ్ రిజర్వాయర్ పనులు ప్రారంభించిందని, అప్పటి ప్రభుత్వ పెద్దలు, అధికారులు అందరి కంటే ఎక్కువ పరిహారం ఇస్తామని, ఇప్పటి వరకు ఎకరాకు రూ.45 వేలు లీజు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వం చేసిన మోసం పట్ల నిరసన తెలియ జేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా, పోలీసులుతో రైతులను నిర్బంధించి దౌర్జన్యంగా పనులు ప్రారంభించారని దుయ్యబట్టారు. వ్యవసాయం చేసుకుంటూ సంవత్సరానికి రూ.5 నుండి రూ.10 లక్షల వరకు ఫలసాయం పొందుతున్న రైతులు భూములు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టడుతున్నారన్నారు. ఒకపక్క ప్రాజెక్టుకు భూములు కోల్పోయి పనులు లేక, మరోపక్క ప్రభుత్వ పరిహారం అందక కుటుంబాలు గడవక రైతులు పస్థులతో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రిజర్వాయర్ పనులు జరిగే సందర్భంగా పరిహారం ఇవ్వాలని, పునరావాసం కల్పించాలని కోరుతూ రైతులు శాంతియుతంగా, సామరస్యంగా నిరసన తెలిపితే పోలీసులు వచ్చి బెదిరించి, రైతులను నిర్బంధించి పనులు కొనసాగించారే తప్ప పరిహారం పునరావాసం చెల్లించలేదని పేర్కొన్నారు. కొంతమందికి మాత్రమే ఒక సంవత్సరం లీజు చెల్లించారు కానీ ఇప్పటికీ రైతులకు పరిహారం అందించలేదు. పునరావాసం కల్పించలేదని, ఇలాగే కొనసాగితే పిల్లలను చదివించుకోలేని దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన తెలిపారు. భూములు లేని కూలీల పరిస్థితి మరీ దుర్భరంగా మారిందన్నారు. ఇప్పటికైనా ముదివేడు బాలన్సింగ్ రిజర్వాయర్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులకు, వెంటనే 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి ఇచ్చి పరిహారం ఇవ్వాలని, పునర్నిర్మాణం, పునరావాస కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు హరిశర్మ, ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ముదివేడు రిజర్వాయర్ నిర్వశితులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా లీజు పెంచి బకాయిలు చెల్లించాలని కోరారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు 2013 భూ సేకరణ చట్టం మేరకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం నాయకులు శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, సురేష్, తిరుమలరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, అమరావతి, ప్రభావతి పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి : కలెక్టర్



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, రాజంపేట ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కలెక్టర్ గిరీష పిఎస్ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు పెరేడ్ మైదానంలో అమరులైన పోలీసు వీరులకు కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఘనంగా నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, 1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పదిమంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలు అర్పించారని పేర్కొన్నారు. వారి ధైర్యాన్ని, త్యాగాన్ని అక్టోబర్ 21న పోలీసు సంస్మరణ దినోత్సవంగా జరుపుకుం టున్నామన్నారు. భారతదేశానికి చైనా, పాకిస్తాన్ తదితర దేశాలతో గల సరిహద్దులలో ప్రమాదం ఎప్పుడు ముంచుకొస్తుందో తెలియని పరిస్థితులు ఉన్నాయని, ఆ సరిహద్దులలో పర్వతశ్రేణులు, మంచు కొండలు వంటి క్లిష్ట పరిస్థితులు ఉంటాయని, అయినప్పటికీ మన జవానులు దేశ రక్షణలో నిరంతరం మునిగి ఉంటారని చెప్పారు. రాష్ట్రంలోని పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో, ప్రజల భద్రతకు భరోసా కల్పించడంలో, చట్టాలను పరిరక్షించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో మాత్రమే కాకుండా రాత్రిపూట పెట్రోలింగ్, ట్రాఫిక్‌ను నియంత్రించడం, మెడికల్ ఎమర్జెన్సీలు, ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాలలో ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు లభిస్తాయని తెలిపారు. విజ్ఞప్తి చేశారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ దేశభద్రత కోసం పగలనక, రేయనక, విధినిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్ళు, అధికారులు విధులను విజయవంతంగా నిర్వహించడంలో భాగంగా వారు తమ ప్రాణ త్యాగాలను, సేవలను సింహావలోకనం చేసుకుంటూ సేవల అర్థాన్ని పరమార్థాన్ని గుర్తిస్తూ కొనియాడుట మనందరి కర్తవ్యమన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న పోలీసులను కోరేది ఏమంటే మనమందరం కష్టపడి ప్రజా రక్షణలో నిమగ్నమై వారి ఆస్తులను, ప్రాణాలను కాపాడుతూ... వారికి అవసరమైనప్పుడు మనం ఉన్నామనే భరోసా కల్పించాలని పేర్కొన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయి అమరులైన పోలీసులు అందరికీ జోహార్లు తెలిపారు. అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబాలకు కుట్టు మిషన్లు, సైకిళ్లు, తదితర వస్తువులను కలెక్టర్, ఎస్‌పి అందించారు. కార్యక్రమంలో సాయి లోకేష్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి పాల్గొని అమరవీరులకు ఘన నివాళి అర్పించారు. **కలికిరి:** అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని సిఐ రెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహబూబ్ బాషా, హెడ్ కానిస్టేబుల్ కొండప్ప, పోలీస్ కానిస్టేబుల్ సిద్ధు, చైతన్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శ్రీనివాస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలకు విద్యార్థి సంఘాల డిమాండ్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అనుమతులు లేకుండా నడుపుతున్న సైనిక్, నవోదయ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు జిల్లా నాయకులు సర్వేపల్లి నరసింహ, నేతి నాగేశ్వర డిమాండ్ చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అనుమతులు లేకుండా నవోదయ, సైనిక్ స్కూళ్లను నడుపుతున్నారని పేర్కొన్నారు. అక్కడ చదివే విద్యార్థులందరూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న గవర్నమెంట్, ప్రయివేట్ పాఠశాలల్లో చదివే వారని తెలిపారు. కొన్ని పాఠశాలల హెచ్ఎంల సహకారంతో సైనిక్, నవోదయ కోచింగ్ సెంటర్‌లో చేర్పించి వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నారన్నారు. ఐదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఎర వేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు సరైన వసతులు కల్పించకుండా అమ్మాయిలు. అబ్బాయిలు ఒకే చోట హాస్టల్ వసతి కల్పిస్తున్నారని అన్నారు. కనీస మౌలిక వసతులు కల్పించకుండా విద్యార్థులకు ఇరుకు గదులలో చదువులు చెబుతున్నారని వాపోయారు. సమయం సందర్భం లేకుండా ర్యాంకుల పేరుతో వేధిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై గతంలోనే స్థానిక జిల్లాస్థాయి అధికారులకు పలుమార్లు వివరించినప్పటికీ ఫలితం లేదని, ఇప్పటికైనా ఈ సంఘటనకు తోడ్పడుతున్న హెచ్ఎంలను ఎంఇఒలు, జిల్లా విద్యాశాఖ అధికారులపై విచారించి సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గురునాథ్, సాయి, సతీష్ పాల్గొన్నారు



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళితులు

దళితులపై పెత్తందార్ల దాడి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని పెరుమాళ్ళపల్లి కమ్మపల్లి దళితవాడలో సోమవారం దళితులపై పెత్తందార్లు కట్టెలతో దాడి చేశారు. ప్రభుత్వ భూమిని సొంతం చేసుకోవడం కోసం దళితులపై కొంత మంది పెత్తందార్లు దళితులను తీవ్రంగా గాయపర్చారు. ఎస్ఐ మహేష్ నాయుడు వివరాల మేరకు.. ఈ ఘటనలో పెంచలయ్య, పంట కృష్ణయ్య, మడగలం ప్రభుదాసు అనే ముగ్గురు దళితులకు తలకు గాయాలవ్వగా మరొకరికి చేయి విరిగిందని తెలియజేశారు. దళితులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ నాయుడు తెలియజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు : కూటమి ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి తమ వారిని పెట్టుకోవాలని, రాజకీయ వేధింపులకు పాల్పడుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి పి.జాన్ ప్రసాద్ అన్నారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగస్తులను తొలగించడం, కొత్తవారిని పెట్టుకోవడం, రాజకీయ వేధింపులు చేయడం సరైన కాదని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కోడూరు బుడుగుంటపల్లి దళిత మహిళా ఉద్యోగి, ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడకపోయినా తొలగించాలని అధికార పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు ఎపిడిపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, ఇది చాలా ఆందోళన కరమైన విషయం పేర్కొన్నారు. వారం రోజుల క్రితం ఆకాశ రామన్న ఉత్తరంపై రాజంపేట ఎపిడి కూలీల సమక్షంలో విచారణ జరిపారన్నారు. ఈ ఫీల్డ్ అసిస్టెంట్ కావాలని కోరారన్నారు. కొత్తవారిని ఎవరిని నియమించిన అంగీకరించమని తేల్చి చెప్పారని తెలిపారు. ఉపాధి హామీ చట్టం వామపక్ష పార్టీలు పోరాట ఫలితమన్నారు. సిఎం, డిప్యూటీ సిఎం రాజకీయ కక్షలు, వేధింపులు ఉండవని ఓ పక్క ప్రకటిస్తే కింది స్థాయి నాయకులు, దానికి భిన్నంగా పనిచేస్తున్నారన్నారు. ఎఫ్ఎల తొల గింపు ఆలోచన విరమించుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడం ఆందోళన కలిగిస్తోందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. నాలుగు నెలల కూటమి ప్రభుత్వ పాలనలో 74 సంఘటనలు జరగడం శోచనీయమన్నారు. నందికొట్కూరు సంఘటన, పిఠాపురం అంశం నుంచి అత్తా కోడళ్లను మానభంగం చేసిన సంఘటన, పుంగనూరు, బద్వేలు సంఘటనలు ఇవన్నీ కూడా దారుణాతి దారుణంగా ఉన్నాయన్నారు. సంఘటన జరిగిన వెంటనే నిందితులను పట్టుకుంటామని ఒక స్టేట్ మెంట్ ఇచ్చేసి కంటితుడుపు చర్యగా మాట్లాడేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. అలాకాకుండా సంఘటనలు ఎందుకు, ఎలా జరుగుతున్నాయి? ఎలా అరికట్టాలన్న విషయాలపై ఇప్పటికైనా కళ్ళు తెరచి మహిళల భద్రత విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడా మాన భంగాలు, అత్యాచారాలు జరగకుండా, ప్రజలకు ధైర్యం, నమ్మకం కలిగేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బద్వేలు సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటి సంఘటనలకు పాల్పడే ఏ ఒక్కరికీ అటువంటి ఆలోచనలు రాకుండా ఉండేలా శిక్షించాలన్నారు. పోలీసులకు రాజకీయ నాయకులు పూర్తి స్వేచ్ఛను అందించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈ నెల 26, 27వ తేదీలలో రాయచోటిలో నిర్వహించబోయే సిపిఎం జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి ఫాసిస్ట్ విధానాలకు జగన్, నేడు చంద్రబాబు బాసటగా ఉన్నారని ఎద్దేవా చేశారు. సొంత ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను బిజెపికి తాకట్టు పెట్టారని పేర్కొన్నారు. ప్రజాసమస్యలను గాలికొదిలేశారన్నారు. మరోవైపు పవన కళ్యాణ్ తన నటనా చాతుర్యంతో తిరోగమన విధానాలైన ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, విహెచ్‌పిలను ప్రోత్సహిస్తూ సనాతన ధర్మం పేరుతో రాష్ట్రంలో మత కుల వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని వాపోయారు. టిడిపి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా కాలం గడుపుతోందని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ కరెంట్ భారాలతో నడ్డి విరచడానికి సిద్ధమైందని విమర్శించారు. విపరీత వర్షాలు, కరువుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని తెలిపారు. కార్మిక ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. ఈ క్రమంలో ప్రజలను సమీకరించి పాలకుల వైఖ్యాలను ఎండగట్టి ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడానికి సిపిఎం సిద్ధమైందని పేర్కొన్నారు. మహాసభలో జిల్లా సమగ్రాభివృద్ధి కార్యాచరణ రూప కల్పన చేస్తున్నామని వెల్లడించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. వెంకరటేశ్వర్లు హాజరవుతున్నారని తెలిపారు. ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు మహాసభల జయప్రదానికి ఆర్థిక హార్థిక సహాయం చేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, నాయకులు నాగబసిరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

బాలలతో పనిచేయించడం చట్టరీత్యా నేరం

- సహాయ కార్మిక అధికారి ఆనంద బాబు

ప్రజాశక్తి-పీలేరు

బాలలను పనిలో పెట్టుకోవడం నేరమని, అలా పనిలో పెట్టుకున్న యజమానులకు కఠిన శిక్షలుంటాయని పీలేరు సహాయ కార్మిక అధికారి కెఆర్ ఆనంద బాబు, మండల విద్యాశాఖ అధికారి వై.లోకేశ్వర రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్మిక శాఖ సహాయ కార్మిక అధికారి, న్యూఢిల్లీ జాతీయ బాలల హక్కుల పరిరక్షణా సంస్థ (నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్) ఆదేశాలతో, రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ సూచనలపై, జిల్లా కలెక్టరు, కార్మిక శాఖ జిల్లా బాధ్య అధికారుల పర్యవేక్షణలో ఈనెల 21 నుండి నవంబర్ 20 వరకు బాల కార్మికులను గుర్తించేందుకు "తనిఖీలు, పునరావాసం" కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం పీలేరు పట్టణంలో పలు షాపులు, ప్రయివేటు సంస్థల్లో మండల టాస్క్ ఫోర్సు కమిటీ సభ్యులు తనిఖీలు నిర్వహిస్తూ బాల కార్మికవ్యవస్థ నిర్మూలన గురించి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు వయస్సు పిల్లలు బడిలో ఉండాలని, పనిలో కాదన్నారు. బాలకార్మిక వ్యవస్థ నుంచి పిల్లలను విద్య కోసం ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో పీలేరు సహాయ కార్మిక అధికారి కెఆర్ ఆనంద బాబు, మండల విద్యాశాఖ అధికారి వై.లోకేశ్వర రెడ్డి, మండల విద్యా శాఖ, ఐసిడిఎస్, వైద్య శాఖల సిబ్బంది, గ్రేట్ విజన్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జివిఎస్ బాబు, సాంఘిక సంక్షేమశాఖ సిబ్బంది, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భూ కబ్జాలకు పాల్పడే సంస్కృతి వద్దు : 'నల్లారి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలెవరూ భూ కబ్జాలకు పాల్పడే సంస్కృతిని అలవర్చుకోవద్దని, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించవద్దని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి హితవు పలికారు. సోమవారం టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయ కులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 26 నుంచి చేపట్టనున్న టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంపై వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే ప్రతి పనినీ ప్రజలు నిశితంగా గమనిస్తుంటారన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన విధంగా చెరువులు, కుంటలు, గుట్టలు, ఇతర ప్రభుత్వ స్థలాల కబ్జాలకు పాల్పడి మనం కూడా పాల్పడకూడదని చెప్పారు. ప్రతి కార్యకర్త అవసరాన్ని గుర్తించి ప్రభుత్వమే నివేశ స్థలాలు కేటా యిస్తుందని వివరించారు. టిడిపి సభ్యత్వ నమోదులో లక్ష్యాన్ని అధిగమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కుప్పం అసెంబ్లీ నియోజకవర్గం తర్వాత ఆ స్థాయిలో పీలేరు అసెంబ్లీ నియో జకవర్గంలోనూ పార్టీ సభ్యత్వ నమోదును చేసి, పార్టీ పట్ల మనకున్న అభిమానం, అంకిత భావాన్ని చాటుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అధికారంలో లేనప్పుడే మనం పీలేరు నియోజకవర్గంలో జరిగిన టిడిపి ప్రతి కార్యక్రమాన్నీ విజయవంతంగా పూర్తి చేసి, పార్టీ అధిష్టానం దృష్టిని తాకామని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఇక ముందు కూడా పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ ప్రథమ స్థానంలో నిలవాలని పిలుపుని చ్చారు. టిడిపి సభ్యత్వానికి రూ.100 చెల్లించి సభ్యత్వం పొందే ప్రతి ఒక్కరికి రూ.5 లక్షలు బీమా సౌకర్యం పార్టీ కల్పిస్తున్నట్లు తెలియ జేశారు. సభ్యత్వం కావాలని కోరుకున్న వారికి మాత్రమే ఇవ్వాలని తెలియ జేశారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, పార్లమెంట్ నాయకులు కోటపల్లి బాబురెడ్డి, మాజీ జడ్‌పిటిసి డాక్టర్ మల్లెల రెడ్డిబాష, బిసి నాయకుడు పురం రామ్మూర్తి, మాజీ మండల అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, వసంతాల రాజ పాల్గొన్నారు.

గాజుల ఖాదర్‌బాషాపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి

సొసైటీ పేరుతో మోసం చేసిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషాపై చర్యలు తీసుకో వాలని మదనపల్లికి చెందిన బాధితులు నారాయణస్వామి, లక్ష్మీదేవి, జ్యోతి, చిత్రావతి, రాధా, నాగార్జున డిమాండ్ చేశారు. సోమవారం వారు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ వడ్డీకే రుణాలు ఇప్పిస్తామంటూ మోసం చేసాడంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రాయచోటిలో రవీంద్ర నగర్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ, మదనపల్లి ఇఇఇ, సిటిజన్స్ పేరుతో బాధితుల నుంచి వారి స్థలానికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ తీసుకొని గృహ నిర్మాణాలకు కో- ఆపరేటీవ్ హౌస్ ద్వారా రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు మంజూరైనా రుణాల చెక్‌లు పొందాలంటే గాజుల ఖాదర్‌బాషాకు ఒకొక్కరు రూ. 40 వేలు కమీషన్ కట్టాల్సిందే అంటున్న బాధితులు తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో వాయిదాలు చెల్లించినా కో-ఆపరేటివ్ హౌసింగ్ వారికి చెల్లించకుండా తమ స్వప్రయోజనాలకు సొసైటీ వాడుకుంటున్నారు ఆరోపించారు. తీసుకున్న రుణం చెల్లించకపోతే ఇంటిని జప్తు చేస్తామంటున్న బ్యాంకర్లు హెచ్చరిస్తున్నారని తెలిపారు. ఎవరి దగ్గరకు వెళ్లినా ఖాదర్‌బాషా తన రాజకీయ పలుకుబడితో అందరినీ సర్దుబాటు చేస్తున్నారని బాధితులు వాపోయారు. ఖాదర్‌బాషా పలు ప్రాంతాలలో పలు పేర్లతో సొసైటీలను ప్రారంభించి తమను మోసం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదు. అర్జీదారుల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ సత్యనారాయణరావు, ఆర్‌డిఒ రంగస్వామి, ఎస్‌డిసి రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్ సిస్టంలో కూడా లాగిన్ అయ్యి ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్‌ఎల్‌ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా విని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండి వాటిని బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ఏవైనా తమ పరిధిలో పరిష్కారం చూపలేని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయిలో మండల, డివిజన్ ప్రధాన కేంద్రాలలో కూడా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను పకడ్బందీగా నిర్వహించి చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అప్పయ్యరాజుపేటలో చెత్త దిబ్బలు తొలగింపు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట గ్రామంలో సోమవారం ఉప సర్పంచ్ సయ్యద్ ముస్తాక్, ఇఒపిఆర్‌డి పెంచలయ్య ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి పెంచలయ్య మాట్లాడుతూ పంచాయతీలోని వీధుల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. పంచాయతీ మొత్తం బ్లీచింగ్, సున్నం చల్లామని తెలిపారు. శీతాకాలం సమీపిస్తున్న వేళ పంచాయతీలో ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా గ్రామం మొత్తం బీజింగ్ సున్నం చెల్లించామని తెలిపారు. పంచాయతీ మోటార్ వద్ద ఉన్న పిచ్చి మొక్కలను కూడా తొలగించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, సచివాలయ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

అయోడిన్ లోపం లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఆహారంలో అయోడిన్ లోపం లేకుండా చూసుకోవాలని, రోజు ఆహారంలో అయోడైజ్డ్ ఉప్పు వాడాలని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆరమడకలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్ లోపంతో బుద్ధిమాంద్యం, పసిబిడ్డ పెరుగుదల లోపించడం, థైరాయిడ్, మహిళల్లో ఋతుస్రావ సమస్యలు, గర్భధారణ సమస్యలు, వెంట్రుకలు రాలిపోవడం, నిద్రలేమి, స్థూలకాయం వంటి వ్యాధులు వస్తాయన్నారు. విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజ లవణాలు, పీచుపదార్థాలు ఉన్న ఆహారంతో పాటు నీరు ఎక్కువగా తాగడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పి రమ్య, ఎఎన్ఎం ధనలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మిట్స్' విద్యార్థులకు రాష్ట్ర స్థాయి అవార్డులు

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టిఇ-2024) అవార్డులకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. బి.టెక్ ఇఇఇ చదివిన కాగితి భార్గవికు బెస్ట్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థి-2023 అవార్డు, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ చదివిన కార్తీక్ కోవికు బెస్ట్ స్టూడెంట్ ఇన్నోవేటర్-2023 రాష్ట్ర అవార్డులకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఈ అవార్డులకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఐఎస్‌టిఇ బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డును ఇదివరకే ప్రకటించారన్నారు. కళాశాలకు మూడు అవార్డులు లభించినట్లు తెలిపారు. ఈ అవార్డులను ఈ ఏడాది అక్టోబర్ 25వ తేదీన కర్నూల్‌లోని జి.పుల్లా రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ లో జరుగు అవార్డుల ప్రదానోత్సవంలో ఈ అవార్డును అందుకుంటారన్నారు. ఐఎస్‌టిఇ ప్రతి ఏటా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డులు ప్రకటిస్తారని, ఈ సంవత్సరం మూడు అవార్డులను దక్కించుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, అధ్యాపకులువిద్యార్థులు, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, కాగితి భార్గవి, కార్తీక్ కోవిలను అభినందించారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి :'పసుపులేటి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మేధావులు తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ సూచించారు. సోమవారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల కార్యాలయ భవనంలోని అఖిలభారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ కల్చరల్ అవేర్నెస్ సొసైటీ అర్పిత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 24వ ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాలలో తెలుగు నేలకు గొప్ప గుర్తింపు, గౌరవాలు ఉన్నాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో కళలను మరింత ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ రంగాలలో ప్రతిభావంతులైన 26 మంది కళాకారులను జ్ఞాపికలు, పతకాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు కవయిత్రి సినీనటి పంకజ, విజయవాడ గుణదల కార్పొరేటర్ సునీత, రాజమండ్రికి చెందిన సత్యనారాయణ, కళాకారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భూ సమస్యలపై గ్రామసభలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఈ నెల 23వ తేదీ నుంచి రీ సర్వే చేసిన భూముల సమస్యల పరిష్కారం కొరకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ధనంజయలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ నెల 23వ తేదీ తవళం, 24వ తేదీ బి.వెళ్లివారిపల్లి, 25, 26వ తేదీలలో నిమ్మనపల్లి 1, 2, 29వ తేదీ అగ్రహారం, 30వ తేదీ సామకోటవారిపల్లి గ్రామాలలో రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నామన్నారు. రైతులు, ప్రజలు రీ సర్వే గ్రామ సభలకు హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని, గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్ఎస్ రోడ్డులో మద్యంషాపు తొలగించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేస్టేషన్ రోడ్డులో స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న మద్యం షాపును తొలగించాలంటూ సిపిఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. విద్యాసంస్థలు, కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే మార్గంలో ఈ మద్యం షాపు ఏర్పాటుచేసి మద్యం బాబులతో ఆపద కలిగే ఉందని తెలిపారు. షాపును మార్చాలని తహశీల్దార్ మహబూబ్ చాంద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పండుగోల మణి, చైతన్య, రాజశేఖర్, జయరాం విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలి

ప్రజాశక్తి-కంభంవారిపల్లె

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని గ్యారంపల్లి పిహెచ్‌సిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను, మందుల నిల్వలను పరిశీలించారు. వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో కేంద్రం సాధించిన ప్రగతిని సమీక్షించారు. వ్యాక్సిన్లను నిల్వ ఉంచిన తీరును, రోగుల వార్డును, కాన్పుల గదిని పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ, సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణులను వీలైనంత త్వరగా గుర్తించి, హైరిస్క్ గర్భిణుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు. ప్రతి నెల 9వ తారీకు నిర్వహించే పిఎం సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నిరంజన్ రెడ్డి, సూపర్వైజర్ పురుషోత్తం, సిబ్బంది రమణి, కవిత, స్వర్ణలత, భానుప్రియ, గిరిబాబు పాల్గొన్నారు.

కాలనీ ఇచ్చారు.. వసతులు మరిచారు

- సమస్యల సుడిగుండంలో కొత్తరెడ్డిపల్లె కాలనీ
- రోడ్లు, కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు
- తాగునీటికీ అవస్థలు
- స్పందించని నేతలు, అధికారులు



కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి పట్టణం బెంగళూరు రోడ్డులోని అంకిశెట్టిపల్లి పంచాయతీ పరిధిలో బెంగుళూరు నేషనల్ హైవే ప్రక్కనే వేంపల్లి క్రాస్ వద్ద కొత్తరెడ్డిపల్లి కాలనీ ని ప్రభుత్వం నిర్మించింది. 2006లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో 150 మంది పేదలకు ఇంటి స్థలాలను ప్రభుత్వం కేటాయించింది. అందులో హౌసింగ్ కింద ఇళ్లు మంజూరు చేశారు. ప్రజలు ఇళ్లను నిర్మించుకుని నివాసాలు ఉంటున్నారు. అయితే వారికి ప్రభుత్వం కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు కూలీ నాలి చేసుకుని జీవనం చేసే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు తాత్సారం చేస్తుడడంతో కాలనీ వాసులు పలుమార్లు నాయకులు, అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అయినా కాలనీలో కనీస వసతులు ఏర్పాటు చేయలేదు. మిట్ట ప్రాంతం కావడం, రోడ్లు కోసుకుపోయి చాలా అధ్వానంగా ఉన్నాయి. వీధి రోడ్లు రాళ్లు, మట్టితో నిండిపోయి గుంతల మయంగా ఉండడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో ఆ రోడ్లపై నడుస్తూ కొంతమంది వృద్ధులు, పిల్లలు, బరువులు మోసుకెళ్లేవారు కిందపడి కాళ్లు, చేతులు విరగ్గొట్టుకుని మంచం పట్టారు. కాలువలు లేకపోవడంతో మురికి నీరు పారేందుకు మార్గం లేకుండా చెత్తాచెదారం పేరుకుపోయాయి. దానివల్ల తరచూ కాలనీ వాసులు జబ్బుల బారిన పడుతున్నారు. తాగునీటి సమస్యంగా తీవ్రంగా ఉంది. 150 ఇండ్లు ఉన్న ఈ ప్రాంతంలో కేవలం ఒక్క ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేస్తుండడంతో సరిపడా నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పెడచెవిన పెట్టారని, నేతలను ఆశ్రయించినా ఇదిగో.. అదుగో అంటూ కాలయాపన చేశారని, ఎవరికి చెప్పుకోలేక దిక్కు తెలియక సమస్యల సుడిగుండంలోనే కాలం వెలదీస్తున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే తమ ప్రాంతాలకు విచ్చేసే నేతలు, ఎన్నికల అనంతరం ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. గత వైసీపీ ఎమ్మెల్యేకి కాలనీలో వసతులు కల్పించాలని విన్నవిస్తే మీరెవరు నాకు ఓటు వేయలేదని మీకు ఎలా వసతులు కల్పిస్తామని మొహం మీదనే మాట్లాడారని తెలిపారు. ఏమి చేయాలో పాల్పోక మిన్నుకుండిపోయామని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఇప్పటికైనా కాలనీలో సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాబావం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సమస్య పరిష్కారం కోసం ఇదివరకే ఎమ్మెల్యే షాజహాన్ బాషను కలిశామని, తమ కాలనీలో ముఖ్యంగా రోడ్లు వేయాలని, కాలువలు నిర్మించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరామని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని,



కాలువల్లో పేరుకుపోయిన మట్టి

అయితే 2006 నుంచి ఇప్పటివరకు తాము అధికారులను కలుస్తూనే ఉన్నా ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు కాలనీలో పర్యటించి రోడ్లు వేసి, కాలువలు నిర్మించాలని, తాగునీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.

రోడ్లు లేక ప్రమాదాల బారిన పడుతున్నాం



మా కాలనీలో రోడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల ప్రభావతి, సరస్వతి అనే ఇద్దరు మహిళలు కిందపడి కాళ్లు చేతులు విరగ్గొట్టుకున్నారు. వీళ్లే కాకుండా గతంలో ఎంతోమంది ఈ రోడ్లపై పడి గాయాల పాలయ్యారు. వర్షం పడిందంటే ఇక నరకమే. కాలనీలో రోడ్లు వేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు.

- నాగవేణి స్థానికురాలు

తాగునీటికి ఇబ్బందిగా ఉంది



కాలనీలో 150 ఇళ్లు ఉన్నాయి. అరకొరా నీళ్లు వదులుతుండడంతో మిట్ట ప్రాంతాల్లో ఉన్న ఇళ్లకు నీరే అందడం లేదు. అధికారులు మా సమస్యలపై స్పందించి నీటి సమస్య లేకుండా చూడాలి. అదే విధంగా కాలువలు నిర్మించి, మురుకునీరు, వర్షపు నీరు పారేందుకు చర్యలు తీసుకోవాలి.

- నాగరాజు కాలనీవాసి

కేసు విచారణకు హాజరైన వ్యక్తికి గుండెపోటు

- ఆసుపత్రికి తరలించే లోపే మృతి
- పోలీసు స్టేషన్ ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యులు ఆందోళన

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి)

సంబేపల్లి మండలం కొండవాండ్లపల్లికు చెందిన దేవరాజు (60) సోమవారం కేసు విచారణ కోసం వచ్చి ఒకసారిగా చాతిలో నొప్పి రావడంతో కుప్పకూలి పడిపోయాడు. అతడిని వైద్య నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతను గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యులు మృతదేహాన్ని సంబేపల్లి పోలీసుస్టేషన్ ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. రాయచోటి రూరల్ సిఐ సంఘటన విషయాన్ని తెలుసుకొని హుటాహుటిన సంబేపల్లి పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. దేవరాజు కుమార్తె జ్యోతి, ఆడబిడ్డ అంజనమ్మ పోలీసుస్టేషన్లో బంగారు విషయంపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణకు పిలిపించినట్లు తెలిపారు. అతను హృద్రోగి కావడంతో ఉన్నట్లుండి ఛాతి నొప్పి వచ్చినట్లు మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ విషయంపై స్టేషన్‌లో జరిగిన విచారణ సంఘటనపై సిసిటివి ఫుట్టేజులను ఒకసారి పరిశీలించమని రూరల్ సిఐ వరప్రసాద్ మృతుని కట్టుంబ సభ్యులను కోరారు. మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన విరమించకపోవడంతో రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ సంబేపల్లి కుచేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి సిసి



పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న మృతుని కుటుంబ సభ్యులు

పుటేజీలను పరిశీలించాలని కోరారు. కుటుంబ సభ్యులు సిసి పుటేజ్‌లను పరిశీలించి ఆందోళన విరమించారు. ఫిర్యాదు చేసిన వారి నుండి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని తమకు ఏమి జరిగినా వారిదే బాధ్యతని డిఎస్‌పి ముందు మృతుని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ విషయంపై విచారించి తగుచర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని తీసుకెళ్లారు.

చాతి నొప్పితోనే మృతి చెందాడు : డిఎస్‌పి

సంబేపల్లి మండలం దుద్యాల గ్రామాని చెందిన అంజనమ్మ బంగారు విషయంపై ఫిర్యాదు మేరకు దేవరాజును స్టేషన్‌కు పిలిపించారని, అతడికి గుండెనొప్పి రావడంతో చనిపోయాడని డిఎస్‌పి తెలిపారు.

22 ఏళ్లుగా న్యాయం జరగలేదు

శుద్ద రాయి మైన్స్ లీజుదారు కృష్ణంరాజు



తనకు జరిగిన అన్యాయాన్ని తహశీల్దారుకు వివరిస్తున్న కృష్ణంరాజు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రెవెన్యూ కార్యాలయం చుట్టూ 22 ఏళ్లుగా తిరుగుతున్న న్యాయం జరగలేదని సుద్ద రాయి మైన్స్ లీజుదారు గద్దలరేవుపల్లె కృష్ణంరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుడు కృష్ణంరాజు తన సమస్యను తహశీల్దారు మహబూబ్‌చాంద్‌కు మొరపెట్టుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1983 సంవత్సరంలో మండలంలోని వివి కండ్రిక గ్రామ సమీపంలో సుద్ద రాయి గనులకు సంబంధించి గనుల శాఖ వారు 300 ఎకరాలు లీజుకు ఇచ్చారని కొంతకాలం మైనింగ్ నిర్వహించామని పేర్కొన్నారు. 1991, 92, 93 ప్రాంతాల్లో రెవెన్యూ శాఖ అధికారులు దాదాపు 200 ఎకరాల్లో పట్టాలు ఇచ్చారని మైనింగ్‌కు లీజుకి ఇచ్చారని తెలిసి కూడా పట్టాలు ఇవ్వడం ఎంత దారుణమని ప్రశ్నించినా రెవెన్యూ అధికారుల్లో చలనం లేదన్నారు. 2015లో ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు రెవెన్యూ, మైనింగ్ శాఖ జాయింట్ సర్వే నిర్వహించారని, 30 ఏళ్ల పాటు మైన్స్ లీజు ఉందన్నారు. ముఖ్యమంత్రులు, కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లుకు తమకు న్యాయం చేయాలని పలుమార్లు వినతి పత్రాలు అందజేసిన ఫలితం లేదన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి రెండుసార్లు తన సమస్యను తెలియజేశానని సత్వరమే స్పందించారని అయినా అధికారులు పనులు చేయలేదన్నారు. వైఎస్ఆర్ మృతితో న్యాయస్థానాలు, అధికారులు చుట్టూ తిరిగి కాలయాపన చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెంబరు 130లో మైన్ కు కేటాయించిన భూమిలో రెవెన్యూ శాఖ అధికారులు వందమందికి పైగా గిరిజనులకు పట్టాలు ఇస్తే వాటిని పెత్తందార్లు లాక్కున్నారని తెలిపారు. వారికి ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని గత ప్రభుత్వాలు ఆదేశించిన అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. చివరకు మైన్స్‌కు ఒక ఎకరా కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మైన్స్‌కు వెళ్లేందుకు దారి కూడా లేకుండా చేశారన్నారు, మైన్స్ లీజు కోసం అధికారులను కలవగా 300 ఎకరాల్లో మైన్స్ లీజు కోసం డబ్బులు కట్టమని అడుగుతున్నారని మైన్స్‌కు కేటాయించిన 300 ఎకరాలు లేదని చెప్పానని పేర్కొన్నారు. మైన్స్‌కు కేటాయించిన భూమిని తమకు చూపించాలని అధికారుల చుట్టూ తిరగడానికి తన జీవితం కాలం సరిపోదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు విచారించి తమకు తగిన న్యాయం చేసి మైన్స్ స్థలాన్ని కేటాయించాలని వేడుకున్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకే పల్లెపండుగకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పష్టం చేశారు. సోమవారం మదనపల్లి గ్రామీణ మండలంలో 65 సిసి రోడ్లకు భూమి పూజలు నిర్వహించారు. సిటిఎం-1లో చిన్నాయన చెరువుపల్లి, సిటిఎం క్రాస్ రోడ్డు పంచాయతీలో కొత్తపేట, అడ్డగింటివారిపల్లి, సోమలగడ్డ, దుబ్బిగానిపల్లి పంచాయతీలో ఎనుములవారిపల్లి, కొత్తవారిపల్లి పంచాయతీలో ఎదురు గుమ్మలపల్లి, పోతబోలు పంచాయతీ సిద్ధమ్మ గారిపల్లి, కొత్తగాండ్లపల్లి, బాలాజీ కాలనీ, ఇసుక నూతపల్లి, టిఎస్ఆర్ కాలనీ, బసినికొండ, వలసపల్లి నవోదయ కాలనీ, కొత్తఇండ్లు, పెంచుపాడు ఈశ్వరమ్మ కాలనీ, కొత్తపల్లి పంచాయతీలలో 68 సీసీ రోడ్లకు భూమిపూజ నిర్వహించారు. ఎంపిపి వెలుగు రెడ్డమ్మ చంద్ర, సర్పంచ్ ఆనంద పార్థసారథి, తెలుగుదేశం నేతలు ప్రభాకర్ రెడ్డి, రెడ్డి స్వామి, చల్లా నరసింహులుతో కలసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ఐదేళ్లలో వైసిపి పాలనలో మౌలిక వసతులు లేక గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తట్టివారిపల్లి సచివాలయం వద్ద తెలుగుదేశం నాయకులు ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ జెండాను ఎమ్మెల్యే షాజహాన్ బాష ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, టిడిపి నాయకులు నాదెండ్ల విద్యాసాగర్, షంషీర్, పెంచుపాడు స్వామి, జెసిబి వేణు, రఘుపతి నాయుడు, ఒంటిమిట్ట శ్రీనివాసులు, ప్రసాద్ నాయుడు, సహదేవ నాయుడు, జయరామ్ యాదవ్, రామాంజులు, తిమ్మరాయుడు తెలుగు యువత మండల అధ్యక్షుడు వెంకటరమణ, రాయచోటి శశి కుమార్, సర్పంచ్ ప్రభాకర్, జెసిబి మధు, ఉత్తమ్ రెడ్డి, నాగరాజ లక్ష్మీపతి, మహేష్, నాయి బ్రాహ్మణ సంఘం మంజునాథ్, సాజిద్, నిషా అహ్మద్, మిట్టపల్లి రాజు, చలపతి, చల్లా శ్రీనివాసులు, కత్తి లక్ష్మన్న, చుక్కా విజయ్ కుమార్, శ్రీరామ వినోద్, నవీన్ చౌదరి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న నాయకులు

విద్యార్థిని మృతి బాధాకరం : కాంగ్రెస్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

బద్వేలులో విద్యార్థిని మృతి బాధాకరమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోసాల దేవి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రయివేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న అమ్మాయిపై హత్యాచారం దారుణమన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని తెలిపారు. కొద్ది రోజుల క్రితం అత్తా కోడలుపై గ్యాంగ్ రేప్ మరువకముందే మరో పైగ్యాంగ్ రేప్ చోటు చేసుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు అధికంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో మహిళా హోం మంత్రి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. కడప జిల్లా గోపవరం మండలంలో దారుణం జరిగింది సెంచరీ ప్లే వుడ్ కంపెనీ సమీపంలో ఇంటర్ విద్యార్థిపై ఐదుగురు మానవ మృగాలు హత్యాచారం చేశారని ఆపై పెట్రోల్ పోసినిప్పు అంటించారని ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలికిరి

ప్రత్యేక ఆధార్ క్యాంపు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ భానుమూర్తి రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 22వ తేదీ అద్దెవారిపల్లి, 23వ తేదీ గుండ్లూరు, 24, 25వ తేదీలలో మహల్‌లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. పేరు, ఫోన్ నెంబర్లు నమోదు, పుట్టిన పిల్లలకు ఆధార కార్డు తీయడం, 14 సంవత్సరాల దాటిన వారికి ఆధార్ అప్డేట్ చేయడం, చిరునామా మార్పు వంటి సమస్యలను మండలంలోని ప్రజలు ఆయా సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో హెచ్‌ఎం

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : హెచ్‌ఎం

ప్రజాశక్తి -కలకడ

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోడం చంగల్ రాయుడు తెలిపారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో చిత్తూరు జిల్లా టీం గోల్డ్ మెడల్స్ సాధించిందన్నారు. ఈ టీంలో కోన హైస్కూల్ విద్యార్థులు సమీర్ ఖాన్, గణేష్ రాయల్, షారుక్ ఖాన్, యోగేష్, ముని కిరణ్, జితేంద్ర, శివతేజ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించడంలో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణిస్తే భవిష్యత్తు బాగుంటుందని గెలుపొందిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఝాన్సీరాణిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరి, నాగముని నాయక్, రమేష్ కుమార్‌రెడ్డి, షౌకత్ అలీ, గఫర్ ఖాన్, నౌషాబేగం, సైరాబాను పాల్గొన్నారు.

'టెక్నోహోలిక్స్'లో ఎఐటిఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ సివిల్ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎం.వైష్ణవి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.సువేష్మ అనే విద్యార్థునులు ఎస్ఆర్ఐటి, ప్రొద్దుటూరు కళాశాలలో నిర్వహిస్తున్న టెక్నోహోలిక్స్-2 కె 24 పేపర్ ప్రెజెంటేషన్‌లో ప్రతిభ చూపి ద్వితీయ బహుమతులు గెలుచుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పేపర్ ప్రజెంటేషన్‌లలో విద్యార్థులు పాల్గొనడం వల్ల తమలోని మేధోశక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి విద్యార్థునులను అభినందించారు. సివిల్ ఇంజినీరింగ్ హెచ్ఒడి డాక్టర్ టి.నరేష్ కుమార్, అధ్యాపకులు ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

మత్స్య సంపద కేంద్రాన్ని అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని బహుదా సాగునీటి ప్రాజెక్టు వద్ద ఉన్న బహుదా మత్స్య సంపద కేంద్రాన్ని, అనుబంధంగా ఉన్న మత్స్య సహకార సంఘాన్ని అభివృద్ధి చేయాలని సోమవారం విజయవాడలో మత్స్యశాఖ కమిషనర్ టి.డోలా శంకర్‌ను బహుదా మత్స్య సహకార సంఘం తరపున టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, శ్రీనివాసులు, చంద్రాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షులు చినబాబు ఆయనను కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుదా ప్రాజెక్టు వద్ద ఉన్న మత్స్య సంపద కేంద్రం ద్వారా గతంలో చేప పిల్లలను అభివృద్ధి చేసి, మండలంలోని మత్స్య సహకార సంఘం కింద ఉన్న బహుదా ప్రాజెక్టులో, చెరువులలో చేప పిల్లలను వదిలి పెంచేవారన్నారు. మత్స్యశాఖ కమిషనర్ కూడా బహుదా మత్స్య కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామని సానుకూలంగా తెలిపినట్లు పేర్కొన్నారు.


మిషన్ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - రాయచోటి : ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థకు చెందిన గుంటూరులోని బ్రెయిలీ ప్రెస్‌లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన మెషిన్ ఆపరేటర్ పోస్టుకు అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎ. కుమార్ రాజా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెషిన్ ఆపరేటర్ పోస్టుకు 18 నుంచి 42 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయస్సు సడలింపు వర్తిస్తుందన్నారు. అర్హత కలిగిన వారు తమ బయోడేటా వివరాలు, విద్యార్హతలు, అనుభవం సంబంధిత సర్టిఫికెట్ పత్రాలను జతపరిచి ఈ నెల 24 లోపు ఎపిడిసెస్‌సి ఎసి కార్యాలయంలో కానీ, పోస్ట్ ద్వారా మేనేజింగ్ డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ, డోర్ నెంబర్ 74-14-2, రాజనరేంద్ర బిల్డింగ్ మొదటి అంతస్థు, యనమలకుదురు రోడ్, కృష్ణనగర్, విజయవాడ-520007అనే చిరునామాకు పంపాలన్నారు. అర్హత, పూర్తి వెబ్ సైట్ WWW.apdascac.ap.gov.in లో సంప్రదించాలన్నారు.

స్కీమ్ బోరు మరమ్మతుకు అడ్డంకులు

- తాగునీటికి ఇబ్బంది పడుతున్న దళితులు

ప్రజాశక్తి-రామాపురం : మండలంలోని చిట్లూరు దళితవాడ చెందిన తాగునీటి స్కీమ్ బోరు చెడిపోయింది. మరమ్మతులు చేయడానికి అడ్డంకులు ఏర్పడ్డంతో ప్రజలు తాగునీటికి అల్లాడుతున్నారు. చుట్టుపక్కల వరి పంట సాగు చేయడంతో స్కీమ్ బోర్ వరకు వెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉంది. ఇటీవల ఆ స్కీం బోరు మోటర్ కాలిపోవడంతో మోటర్ రిపేర్ చేయడానికి అక్కడికి మిషన్లు, మెకానిక్ లు వెళ్లడానికి కుదరడం లేదు. దీనివల్ల ఆ గ్రామ ప్రజలు వారం నుంచి తాగునీటితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ స్కీం బోర్‌లో నీరు సమృద్ధిగా ఉన్నా భూయజమాని వల్ల తరచూ తాగునీటి సమస్య ఏర్పడుతోందని గ్రామస్తులు పేర్కొన్నారు. పలుమార్లు భూమి యజమానిపై రెవెన్యూ, పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి బోరుకు దారి కల్పించి తాగునీటి సమస్య లేకుండా చేయాలని దళితవాడ వాసులు కోరుతున్నారు.



స్కీమ్ బోరు చుట్టూ సాగు చేసిన వరి పంట